ప్రజల కష్టాలు తెలిసిన సీఎం జగన్

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- హుషారుగా "మా నమ్మకం నువ్వే జగన్"

తగరపువలస: ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని... త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఆయన అందించిన సంక్షేమ పథకాలు, సేవా కార్యక్రమాలను గుర్తు పెట్టుకుని ఓటేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం భీమిలి మండలం టి.నగరపాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింట సర్వే నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గత ప్రభుత్వం కంటే ఇప్పుడే మెరుగ్గా సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కన్వీనర్లు ఆర్.రామచంద్రరావు, ఇద్దిపల్లి, పల్లా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ ఒకటో వార్డు పెరికివీధిలో వార్డు కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, కన్వీనర్లు జీరు సుజాత, దుంప సాయిరెడ్డి, పందిరి విజయ్, వెంపాడ రమణ, గండ్రేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్మికవాడలో ఇంటింటా సర్వేలో సిమ్మల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

– జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో వాసుపల్లి నరేంద్ర, కంచుబోయిన వెంకటరావు, కొయ్య వెంకటలక్ష్మి, నమ్మి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. డెక్కతిపాలెంలో శిల్లా వంశీరెడ్డి, కొండపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ స్వతంత్రనగర్‌లో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని వారి ఇంటి గుమ్మం, గోడలు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో జీవీఎంసీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, బంగారు ప్రకాశ్, తమ్మిన వరలక్ష్మి, వంకాయల మారుతీ ప్రసాద్, పెండ్ర అప్పన్న, సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, పిళ్లా సూరిబాబు పాల్గొన్నారు.

రెండో రోజూ అదే ఉత్సాహం

ఆనందపురం : వైఎస్సార్ సీపీ చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలోని వివిధ గ్రామాల్లో రెండో రోజైన శనివారం ఉత్సాహంగా సాగింది. తెల్లవారగానే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ అందించిన కిట్లను పట్టుకుని ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను వివరించి మద్దతు కోరారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అని ముద్రించిన స్టిక్కర్లను ఇళ్ల వద్ద అంటించారు. 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించడమే కాకుండా వెంటనే అటు నుంచి వచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సందేశాన్ని ప్రజలకు వినిపిస్తూ కన్వీనర్లు, గృహ సారథులు ముందుకు కదులుతున్నారు. మండలంలో ఇప్పటి వరకూ 20 శాతం వరకు ఇళ్లను సందర్శించినట్టు నాయకులు తెలిపారు.

కొమ్మాది: తీరప్రాంతంలో ప్రతి నోటా జగనన్నే మా భవిష్యత్ అంటూ నినాదాలు వినిపిస్తున్నాయి. ప్రతీ గడపకు సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్పొరేటర్లు తిరుగుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల అమలు తీరు, గత ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి తేడాను అడిగి తెలుసుకుంటున్నారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట, వీబీసీ కాలనీల్లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శనివారం ఇంటింటికీ వెళ్లారు. జీవీఎంసీ 8వ వార్డు తిమ్మాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు పాల్గొన్నారు.


టి.నగరపాలెంలో మహిళలకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


కార్మికవాడలో కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే


చిట్టివలస పెరికివీధిలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో నాయకులు


ఆదర్శనగర్‌లో ఇంటింటా సర్వేలో వైఎస్సార్ సీపీ రెండో వార్డు కన్వీనర్లు


మధురవాడలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కార్పొరేటర్ కొండబాబు


కుసులువాడలో కరపత్రం అందిస్తున్న సచివాలయ కన్వీనర్, గృహసారథులు

కుటుంబ డాక్టర్ విధానంతో పేదలకు మేలు


ఇంటి వద్ద రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న కుటుంబ డాక్టర్ విధానం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతోందని శొంఠ్యాం సర్పంచ్ లెంక లావణ్య అన్నారు. శొంఠ్యాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా శనివారం వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ ఇంత వరకూ ట్రయల్ రన్‌గానే ఉన్న కుటుంబ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు జరపడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ షెహనాజ్ సాధియా 69 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగాలతో ఇంటి వద్దే చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని వైద్య సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షెహనాజ్ మాట్లాడుతూ అంగవైకల్యం గల వారు సచివాలయాలలో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లెంక రాంబాబు, గొంతిన సోమినాయుడు, సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా దివీస్‌లో ఉద్యోగాలు

తగరపువలస: భీమిలి మండలంలోని గ్రామీణ యువకులకు దివీస్ లేబొరేటరీలో దశలవారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని టి.నగరపాలెంలో రూ.40.12 లక్షలతో దివీస్ యాజమాన్యం నిర్మించిన కల్యాణ మండపాన్ని శనివారం ప్రారంభించారు. గొల్లలపాలెంలో రూ.15 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకూడదన్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. స్థానిక ప్రజలు ఎంతో మంచివారన్నారు. చిప్పాడలో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వల్ల పెద్దగా ఉపయోగం లేదని, మండలంలోని యువతకు ఉపయోగపడేలా మరో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ కన్సల్టెంట్ వరహాలరెడ్డికి సూచించారు. రూ.3 కోట్ల దివీస్ సాయంతో గోస్తనీనదిపై నిర్మించనున్న వంతెన పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఇంకా పంచాయతీలో రూ.3.50 లక్షలతో సోలార్ దీపాలు, రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్, రూ.15 లక్షలతో పుష్కరఘాట్ పనులు చేపట్టనున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో పంచాయతీలో 710 కుటుంబాలకు రూ.7.25 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు.

ఇతర పంచాయతీల్లో చేపట్టనున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో టి.నగరపాలెం వాసులకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వెంకటరమణ, జిల్లా వ్యవసాయ సంఘం సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు మజ్జి సూరినాయుడు, జీవీ నారాయణ, సమ్మిడి శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, కొల్లి కోటిరెడ్డి, తుపాకుల అప్పలరాజు, మల్లేటి హరిశంకర్, దుంపల ప్రభాకర్, నీలాపు సూర్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, దివీస్ ప్రతినిధులు ఇ.ఎస్.నాగరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


దివీస్ సహకారంతో నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

రోడ్డును తవ్వేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ప్రభుత్వ పాఠశాల నుంచి గొల్లల ఎండాడకు వెళ్లే మార్గ మధ్యలో రోడ్డును తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు శనివారం తవ్వేశారు.

ఇక్కడ రోడ్డుపైకి మురుగు నీరు వస్తుందనే నెపంతో ఆ నీరు వెళ్లేందుకు అనధికారికంగా రోడ్డును తవ్వేశారు. దీంతో ఉదయం నుంచి ఆయా ప్రాంతాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గమనించిన స్థానికులు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జీవీఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వగా... వెంటనే అధికారులు చేరుకుని ఆ గొయ్యిని పూడ్చివేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఓవరాక్షన్‌పై స్థానికులు మండిపడుతున్నారు.


తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తవ్వేసిన రోడ్డు

వివాదాస్పదంగా జట్లమ్మ ఉత్సవం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో జట్లమ్మ పండగ వివాదాస్పదంగా మారింది. దీంతో గ్రామంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 23న ఉజిడి ఉత్సవం, 24న దేవర సంబరాలు, మే 2న సిరిమానోత్సవం నిర్వహించుటకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం సిరిమాను కోసం గ్రామ సమీపంలోని పిన్నింటి వారి కళ్లాల నుంచి చెట్టు తీసుకురావడానికి నిర్ణయించారు. గ్రామంలోకి చెట్టు తీసుకురావడానికి ఎండ్ల బండి, డప్పులు సిద్ధం చేశారు. అయితే తమతో సంప్రదించకుండా పండగ చేస్తున్నారని వేరొక వర్గం అభ్యంతరం తెలిపింది. చెట్టు తేవడానికి బండి వెళ్లకుండా రోడ్డుపై అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో బండి ముందుకు వెళ్లలేదు. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దిచెప్పారు. అనంతరం ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చడానికి నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పద్మనాభంలో సమావేశం నిర్వహించారు. ఆదివారం పాండ్రంగిలో మళ్లీ సమావేశం నిర్వహించి పండగ నిర్వహణపై చర్చించనున్నట్లు తెలిసింది.


సిరిమాను చెట్టు తీసుకురావడానికి వెళ్లకుండా ఉండిపోయిన ఎడ్ల బండి

నవధాన్యాల సాగుతో నేలకు రక్ష


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

పద్మనాభం: నవధాన్యాలు సాగు చేయడం వల్ల నేలతల్లి బాగుంటుందని సేంద్రియ వ్యవసాయం మండల యాంకర్ మజ్జి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోరాడలో నవ ధాన్యాల సాగు – నేలతల్లి బాగుపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు 12 కిలోలు తొలకరి వర్షాలు పడే ముందు ఎకరం విస్తీర్ణం భూమిలో మే నెలలో జల్లాలన్నారు. జల్లిన 40 నుంచి 50 రోజుల్లో భూమిని కలియదున్నాలన్నారు. వివిధ పంటల వల్ల అనేక రకాల సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది భూమిని సారవంతం చేస్తాయన్నారు. ఖరీఫ్‌లో వరి పంటకు పురుగు మందులు, ఎరువులు వేయకపోయినా పండుతుందని తెలిపారు. ఈ విత్తనాలు నెలఖరులోగా రైతులకు సరఫరా చేయడానికి అందుబాటులో ఉంచామని తెలిపారు.

మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలి

మధురవాడ: పేదవాళ్లు బాగుండాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని, అంతా ఆయనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. శనివారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన పత్రాలు అందజేశారు. రేలంగి అప్పలరాజు కుటుంబానికి రూ.2.98 లక్షలు, పైడి కుమారికి రూ.9 లక్షలు చేయూత, ఇంటి స్థలం, ఇల్లు మంజూరయ్యాయని వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తీసుకుకొచ్చేందుకు అంతా కృషి చేయాలని కోరారు. స్వతంత్రనగర్‌లో మూలకు చేరిన పాత వాటర్ ట్యాంకు తొలగించి పార్కు, ఆట స్థలం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు, పీకేఎం పాత్రుడు, బాబ్జి, అప్పన్న, పాపారావు, గోపి, తమ్మిన వరలక్ష్మి, లోహిత్, కరీమ్, విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య, జెడ్పీ కె.కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


స్వతంత్రనగర్‌లో లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తారలెంతగా మెరిసెనో శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి రస హృదయాలను కట్టిపడేసింది. భయ్యా శ్రీనివాస్, సాత్విక పాడిన అబ్బ ముసురేసింది.. రాము, లయ పాడిన నీవులేక నేను లేను.. అభినయ్, శైలజ పాడిన అందం హిందోళం.. అమ్మాజీరావు, రేణుక పాడిన నా మది నిన్ను పిలిచింది.. మహమ్మద్ ఖాన్, గీత పాడిన చినుకు చినుకు అందెలతో.. సుధీర్, శైలు పాడిన ఇందిర మందిర సుందర.. సూర్యప్రభ పాడిన ఇది మల్లెల వేళయని గీతాలతో అలరించి ప్రేక్షకుల ప్రసంశలు అందుకున్నారు. కళా సంస్థల ప్రతినిధులు ఎస్.ఫణిస్వామి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తుఫాన్ షెల్టర్


పాండ్రంగిలో శిథిలమైన తుఫాన్ షెల్టర్


కిటికీల వద్ద శిథిలమైన ప్రాంతం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో తుఫాన్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యింది. దీంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గోస్తనీ నది తీరప్రాంతాలైన మద్ది, కృష్టాపురం, పాండ్రంగి గ్రామాల్లో 30 ఏళ్ల క్రితం తుఫాన్ షెల్టర్లు నిర్మించారు. విపత్కర పరిస్థితుల్లో గోస్తనీ నది పొంగి నీరు గ్రామాల్లోకి వచ్చేటప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీటిని నిర్మించారు. ఈ మూడు కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నేళ్ల కిందట కృష్టాపురం, మద్ది గ్రామంలో తొలగించారు. పాండ్రంగిలో మాత్రం తొలగించలేదు. ఐదేళ్ల నుంచి ఈ షెల్టర్ ప్రమాదకరంగా ఉంది. దీన్ని ఆనుకుని నివాస ప్రాంతాలున్నాయి.

సమీపంలో ఉన్న బోరు బావి వద్ద మహిళలు తాగు నీరు పట్టుకుంటారు. షెల్టర్‌ను ఆనుకొని ఉన్న అల్లూరి సీతారామరాజు సామాజిక వేదిక వద్ద సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఇప్పటికే తుఫాన్ షెల్టర్ కొన్ని భాగాలు శిథిలమై కింద పడ్డాయి. ఇంకా పడుతూనే ఉన్నాయి. మెట్ల కింద భాగంలో ఇనుప ఊచలు పైకి కనిపిస్తున్నాయి. కిటికీలున్న ప్రాంతంలో, పైఅంతస్తు కొంత కూలిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తుఫాన్ షెల్టర్‌ను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ త్వరలోనే తుఫాన్ షెల్టర్ భవనాన్ని తొలగిస్తామని పేర్కొన్నారు.

34 ఏళ్లుగా అంబేడ్కర్ విగ్రహానికి ముసుగు


ముసుగు వేసి ఉంచిన అంబేడ్కర్ విగ్రహం

తగరపువలస: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో 34 ఏళ్ల క్రితం వేసిన ముసుగు ఇప్పటికీ తొలగించకపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని విగ్రహం ముసుగు తొలగించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. 1989లో ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన చోట అప్పటి కేంద్ర మంత్రి రూ.4 లక్షలు, గ్రామ పంచాయతీ రూ.లక్ష కేటాయించడంతో విగ్రహాన్ని పక్కన పెట్టి కల్యాణ మండపం నిర్మించారు. దీంతో విగ్రహానికి ముసుగువేసి అప్పటి నుంచి ఆరుబయటే వదిలేశారు. తర్వాత అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామకంఠంలో విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నించగా న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. అప్పటి భీమిలి తహసీల్దార్ గ్రామకంఠంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇచ్చినప్పటికీ స్థానికుల్లో ఐక్యత లోపించి ముందుకు సాగలేదు. విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించి ప్రారంభానికి ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించొద్దు


కారుషెడ్ కూడలిలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పీఎం పాలెం పోలీసులు

పీఎం పాలెం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి కష్టాలు తెచ్చుకోవద్దని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీకృష్ణ సూచించారు. కారుషెడ్ కూడలిలో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించాలని పేర్కొన్నారు. వాహనం ముందు, వెనుక రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్లు తప్పనిసరిగా అమర్చాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమలో స్థానిక ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగరావు పోరాటం ఆదర్శం

మధురవాడ: దివంగత సీఐటీయూ నాయకుడు బొట్ట నర్సింగరావు చేసిన పోరాటాలు నేటి తరానికి ఆదర్శం కావాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం కొమ్మాది కూడలి వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో ప్రజా ప్రతినిధి వరకు ఎదిగారన్నారు.

ఆయన స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేపట్టాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధురవాడ జోన్ నాయకులు డి.అప్పలరాజు, కొండమ్మ, పి.రాజు, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి భారీగా భక్తులు


బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వరుసగా మూడు రోజులపాటు సెలవులు కావడం.. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తనలు నిర్వహించారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు ఆహ్వానం

తగరపువలస: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు, హిందీలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ నెల 10న సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు జరుగుతాయి. అంబేడ్కర్ జీవిత విశేషాలపై గంట వ్యవధిలో వ్యాసరచన, భారత రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్రపై అయిదు నిమిషాల పాటు ఉపన్యాస పోటీలు జరపనున్నారు. విజేతలకు ఈ నెల 14న బహుమతులు అందించనున్నట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89856 47419లో సంప్రదించాలని ఆయన కోరారు.

సుందరాచారికి ఘన నివాళి

తగరపువలస: మా తెలుగు తల్లికి మల్లెపూదండ రాష్ట్ర గీత రచయిత శంకరంబాడి సుందరాచారి వర్ధంతి సందర్భంగా బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆయన చిత్రపటానికి శనివారం నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రను వివరించారు. శ్రీవేంకటేశ్వర విద్యాలయం సుందరాచారికి భావకవి అనే బిరుదు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2014లో తిరుపతి పట్టణంలోని తిరుచానూరు రోడ్డులో గల అన్నపూర్ణ సర్కిల్ వద్ద కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిందన్నారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు


సాగర్‌నగర్ తీరంలో వ్యర్థాలు తొలగిస్తున్న విద్యార్థులు

కొమ్మాది: సాగర్‌నగర్ తీరంలో శనివారం ఓక్రిడ్జ్ విద్యార్థులు వ్యర్థాలు తొలగించారు. బీచ్‌ల పరిరక్షణలో భాగంగా భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చేపడుతున్న పలు కార్యక్రమాల్లో భాగంగా బీచ్ క్లీన్ అప్ నిర్వహిస్తున్నామని షైలా బామిదిపతి అన్నారు. 2015 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాప్

సీతంపేట: విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు మండపాక శారద ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సంగీత త్రిమూర్తుల చిత్రపటానికి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. మండపాక శారద మాట్లాడుతూ ఆదివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పలువురు సంగీత కళాకారులు పాల్గొన్నారు.